# నీలాంటి వాళ్ళు

— కోరుకొండ సత్యానంద్

**కంజరి మోత** పిడుగుల శబ్దంలా ఆ ప్రదేశమంతా ఆక్రమించుకుంది.

ఆ శబ్దంలో ఉద్వేగం ఉంది. ఆవేశం ఉంది. ఏదో ఆవేదన ఉంది.

ఆ వూరిలో ఒక పెద్ద ఇంటి ముందు ఆ వూరి మనుషుల పెద్ద గుంపు ఒకటి ఉంది. వాళ్ళందరికీ ఈలలు, కేకలు వచ్చు. కానీ, నిశ్శబ్దంగా చూస్తున్నారు. కారణం— ఆ ఇంటి ఎత్తయిన అరుగు మీద వాలు కుర్చీలో ప్రెసిడెంటు పరశురామయ్య కూర్చున్నాడు.

అతనిది నిండైన విగ్రహం. అతను కన్నెర్రజేస్తే ఆ వూరి వాళ్ళకు పరమశివుడు మూడవ కన్ను తెరిచినట్లే! అతను కోపంతో అరిస్తే వాళ్ళకు సింహం గర్జించినట్లే!

అతని చేతిలో ఖరీదైన చుట్ట. ఒత్తయిన మీసాల క్రింద కనుపించీ కనుపించని నల్లని పెదాల మధ్య ఆ చుట్ట. గుండె నిండా పొగ పీల్చి ఒర్చాగా, విలాసంగా వదులుతున్నాడు.

అతని పెద్ద కళ్ళు వాకిట్లో జరుగుతున్న దృశ్యాన్ని చూస్తున్నాయి.

ఆమె కంజరిని ఒక చేత్తో పట్టుకొని లయబద్ధంగా వాయిస్తూంది.

ఎదురుగా వాడు — ఒంటి మీద చిన్న గోచీ తప్ప మరింకేమీ లేదు. ఎముకల గూడులా ఉంది శరీరం. తల బాగా పెరిగిపోయి ముందుకు వడుతూంది.

వాడి చేతిలో లావుపాటి కొరడా. దాన్ని ఝుళిపిస్తున్నాడు.

ఝుళిపించిన ఆ కొరడాను పైకెత్తి తనను తానే కొట్టుకుంటున్నాడు. ఆ కొరడా వీపుమీద చర్రున తగిలి అతని శరీరాన్ని ఒక్కసారిగా చుట్టేసి మరల వదులైపోతూంది. అతను మరల దాన్ని పైకెత్తి కొట్టుకుంటున్నాడు.

అది ఎవరు వేసిన శిక్షా కాదు. ఆకలి, అవసరం కల్పించిన అవకాశం. దారి లేని ప్రదేశంలో చేరువైన గమ్యం.

దెబ్బ దెబ్బకూ వీపుమీద తెల్లని మచ్చ పడుతూంది.

దెబ్బ దెబ్బకూ ఒక వింత శబ్దం వినిపిస్తూంది.

ఆ శబ్దంలో కరిగే మనసున్న వారికి ఆకలి అరుపు, అది వేసిన శిక్ష ఘోరంగా, గుండెను పిండేలా వినిపిస్తుంది. కళ్ళకు కట్టినట్టు కనుపిస్తుంది.

కానీ, పరశురామయ్యకు మాత్రం వినోదంగా ఉంది. ఆ శబ్దం పులిపంజా దెబ్బకు సవాల్‌లా ఉంది.

కొందరు చోద్యంలా చూస్తున్నారు. కొందరు 'అయ్యో పాపం!' అనుకుంటున్నారు. మరి కొందరు 'తస్సాదియ్యా — భలేగుందిరా!' అనుకుంటున్నారు. ఏమనుకున్నా వాళ్ళ మనసులోనే. నోరు విప్పి పైకి అనే ధైర్యం ఎవరికీ లేదు.

శబ్దం. వింతయిన శబ్దం. కరడుగట్టిన గుండె కరిగిపోయే శబ్దం. ఉరిమే ఉరుములు తెల్లబోయి చూసే శబ్దం.

ఒక పక్కనుండి కంజరి శబ్దం. మరొక పక్క కొరడా శబ్దం.

పరశురామయ్య ఆ శబ్దాల్ని తన గుండెలో నింపుకుంటున్నాడు. ఎంతో ఆనందాన్ని పొందుతున్నాడు.

కాలం ఆగలేదు. ఆ శబ్దం ఆగలేదు. ఎముకలు కనుపించే వీపు మీద ఒకదాని తరవాత ఒకటి తెల్లతెల్లని కొరడా గుర్తులు పడడం కూడా ఆగలేదు.

అందరూ నిశ్శబ్దంగా గాలి పీల్చుకుంటూ చూస్తున్నారు.

ప్రెసిడెంటు గుండె నిండా పొగపీలుస్తూ చూస్తున్నాడు.

అలా కొంతసేపు గడిచింది. ప్రెసిడెంటు పక్కనే కర్ర పట్టుకుని నిలుచుని ఉన్న సత్తిగాడి వైపు చూశాడు. సత్తిగాడు మరింత వంగిపోయి నిలబడి అతని వైపే చూశాడు—'ఏమిటయ్యాగారూ?' అని.

ప్రెసిడెంటు తన పెద్ద జేబును పట్టుకొని అగ్గిపెట్టె, చుట్టల కట్ట, ఇంకా ఏవో కాగితాల మధ్య ఉన్న రూపాయి కాగితాన్ని పైకి తీశాడు.

సత్తిగాడికి ఆ రూపాయిని చూపిస్తూ ఏదో అనబోయే టంతలో గుంపులో చిన్నగా కలకలం రేగింది. గుంపు మధ్యలో నుండి ఠీవిగా నడుచుకుంటూ ఆ వూరి మరొక పెద్ద మనిషి పానకాలు వచ్చాడు, పంచె ఒక చేత్తో ఎత్తిపట్టుకొని.

"ఏమిటయ్యా, ప్రెసిడెంటూ! ఈ చిందుల్ని చూస్తున్నావేంటి చోద్యం లాగా?" అంటూ ఆరు గెక్కాడు.

"ఏం, పాటుందేటి? కాస్సేపు సరదాగా కాలక్షేపం." చిన్నగా నవ్వుతూ అన్నాడు ప్రెసిడెంటు.

"ఆఁ. కాలక్షేపమూను, కాకరకాయూను. ఇదంతా బూటకం. అది నిజంగా గట్టిగా తగిలితే ఆ డింకా బతికే ఉంటాడా ఏటి? శబ్దం మాత్రం ఆకాశం దద్దరిల్లేలా వస్తాది!"

"ఆఁ. లేకపోతే మనం ఇచ్చే రూపాయికి వాడు వీపు సాపు చేసుకుంటాడు. ఏదో ఏసం కడుపునింపుకో దానికి," అన్నాడు ప్రెసిడెంటు.

"ఇంక్కొండరూ మనూరి మీదనే పడిపోయినట్టున్నా రియ్యేల! మా ఈథిలో ఒకడు తెగ బాదేసుకుంటున్నాడు. ఎర్రిజనం మాత్రం పైసామీద పైసా ఇసిరేస్తున్నారు వాడి జోలి లోకి" అన్నాడు పానకాలు.

"ఏటీ — ఇంకోడు కూడా ఉన్నాడా మీ ఈథిలో? మరి, చెప్పవేమయ్యా? రెండు సెట్టులా పోట్టీస్తే మాంచి రంజుగా ఉండదుటయ్యా!" అని "ఒరే సత్తిగా! పానకాలుగారి ఈథిలో కెళ్ళి ఆణ్ణీ కూడా పట్రారా" అని ఆర్డరు వేశాడు ప్రెసిడెంటు.

సత్తిగాడు అక్కడి నుండి కదిలాడు.

వాకిట్లో వాడింకా కొట్టుకుంటూనే ఉన్నాడు.

"ఒరే! ఇక ఆపరా. ఇంకోడు కూడా వస్తాడు. అప్పుడు పోటీగా కొట్టుకుందురుగాని..." ప్రెసిడెంటు గట్టిగా అన్నాడు; చుట్ట అంటించుకుంటూ.

కొరడా శబ్దం ఆగింది. కంజరి శబ్దం కూడా ఆగింది.

అలిసిపోయిన కొరడా కింద వాలిపోయింది. కంజరి ఒక పక్కగా పడుకుని ఉండిపోయింది.

వాడు ఆ పక్కనే—ఆమె పక్కనే కూర్చున్నాడు.

ఆమె వాడి ముఖాన్ని తుడిచింది పమిటచెంగుతో.

వాడు ఒక్కసారి మాటలు రాని మూగ భార్య వైపు చూశాడు. ఆమె కళ్ళలో ప్రేమ, అనురాగం, ఆప్యాయత, 'బాగా అలిసిపోయి ఉన్నావు' అన్న మూగ రోదన ఉన్నాయి.

అలిసిపోయినా, వీచే చల్లగాలికి ప్రాణం హాయిగా ఉన్నట్టుంది. పక్కనున్న డబ్బాలో నీళ్ళు గడగడా తాగేసి అలా కూర్చున్నాడు వాడు.

"ప్రెసిడెంటూ! ఆడు తిండం మానేసి దానికే పెడుతున్నట్టున్నాడు. పిట్ట పిటపిట లాడిపోతంది."

"ఛస్! ఏటా మాటలు? ఆ మాసం నీ కెప్పుడూ బలిసినట్టే కన్పిస్తాది. దేనికైనా కొంచెం లెవిల్ చూసుకోవాలయ్యా!"

"లెవిలేటి, లెవిలు! నీలా వందలు తగలేసి చచ్చు సరుకు దగ్గర కెల్డం నా కలవాటు లేదు. ఇలాటి సరుకే నీటుగా ఉంటాది!"

"ఆఁ ఉంటే ఉండనీ గానీ, ఆడొస్తున్నట్టున్నాడు చూడు" అని అటు వైపు చూపించాడు పరశురామయ్య.

సత్తిగాడు వచ్చి పరశురామయ్య పక్క నిలుచున్నాడు. "ఈడేనండి ఆ యీధిలో ఆడతన్నాడు" అన్నాడు. పరశురామయ్య ఆ వచ్చిన వాణ్ణి చూశాడు.

బలంగా, ఎత్తుగా, మెలికలు తిరిగిన కండలతో, ఒత్తుగా ఉన్న మీసాలతో, ఉంగరాల జుత్తుతో రౌడీలా ఉన్నాడు.

పరశురామయ్య తృప్తిగా చూశాడు.

"ఏం దొరా! పిలిసారంట?"

"ఆఁ. ఒరే! మీ రిద్దరూ వేరే వేరేగా అలా కొట్టుకుని ఏం సంపాదిస్తారు కానీ, నేను మీకు పోటీ పెడతాను. అలా చెయ్యకూడదమూ?"

"ఏంటి, దొరా?"

అందరూ పరశురామయ్య వైపు ఉత్సాహంగా చూస్తున్నారు.

"ఒరే! మీ ఇద్దరికీ కొరడా లున్నాయి కదా? మీ కొరడాలతో మీరు కొట్టుకునే కంటే ఇద్దరూ

ఒకర్నొకరు కొట్టుకోండి. ఆఖరికి ఎవడు రెండో వాణ్ణి పడగొడితే ఆడే ఇరవై రూపాయల నోటు సొంతం చేసుకోవచ్చు. సరేనా?'' గర్వంగా చేతిలో ఉన్న ఇరవై రూపాయల నోటును రెప రెప లాడించాడు పరశురామయ్య.

''చిత్తం. అలాగే, బాబయ్యా!'' రౌడీలా ఉన్న వాడు అన్నాడు.

''ఏరా! నువ్వే టంటావ్?'' పానకాలు అడిగాడు కూర్చున్న వాడిని.


వాడు నెమ్మదిగా లేచి, ''చిత్తం. మీ దయ, బాబయ్యా!'' అన్నాడు.

వాడి భార్య చివాలున లేచి అడ్డు పడింది. 'వద్దు, వద్దు' అన్నట్టుగా తలను, చేతుల్ని వూపింది.

''రత్తీ! ఫర్లేదు. మనం గెలిస్తే ఇరవై రూపాయలొస్తాయి. వారం రోజులు అదెట్టి ఆయిగా బతకొచ్చు'' అని దాని భుజం మీద ప్రేమగా తట్టి ఇటువైపు తిరిగాడు.

దాని ముఖంలో భయంతో కూడిన ఆ భావం ఇంకా పోలేదు. దాని చూపుల్లో ఏం జరగబోతుందో అన్న ఆరాటం ఉంది.

రౌడీలా ఉన్నవాడు గర్వంగా చూశాడు వీడి వైపు. 'బక్క చిక్కిన నాయాల ఈడు నన్నేటి గెలవగల్డు!' అన్నట్టుగా.



“పోతే పోయింది గానీ, భలే ఏర్పాటు చేశావు, ప్రెసిడెంటూ!” అన్నాడు పాసకాలు.

“ఆఁ. ఈపరశురామయ్య అంటే ఏటనుకున్నావ్? పులి బుద్ధులు. ఇప్పుడు చూడు, హోరా హోరీగా సాగుద్ది సమరం.”

లావుగా, మెలికలు తిరిగిన రెండు కొరడాలు ఒక్కసారిగా లేచాయి.

వాళ్ళిద్దరి కళ్ళలో పోటీ, ఆ ఇరవై రూపాయలూ తనే సంపాదించేయాలన్న కోరిక, పట్టుదల.


“ఏవోయ్, పాసకాలూ! పందెం కాస్తావేటి? ఆ లావుగా ఉన్నోడి మీద నాది వంద రూపాయలు.”

“ఎంత తెలివి తక్కువోడివోయ్, ప్రెసిడెంటూ! లావుగా ఉన్నాడనా వాడి మీద పందెం కాశావు? ఇందుకు కావాల్సింది చేతి పట్టు, కొరడా తిప్పడం.. అంతేకానీ, ఒళ్ళు కాదు. అడు బక్కోడైనా కొరడా




daCunha-L-60 TL

14---1--81




బాగా తిప్పుతున్నాడు. అయినా, ఆడికి పెళ్ళాం ఉంది. ఆ పట్టుదలతోనే ఆడు విజృంభించేస్తాడు. నా పందెం ఆ బక్కోడి మీద పంద."

"సరే. ఎంత? పది నిమిషాల్లో తేలిపోద్ది ఏ విషయమూను. ఒరే! మీరుకూడా కాసుకోండ్రా పందాలు!" అరిచాడు పరశురామయ్య.

జనంలో కలకలం రేగింది. పందాలు కాసుకోవడం మొదలు పెట్టారు.

పది నిమిషాల్లో అందరూ పందాలు కాసేసు కున్నారు.

మూగదాని గుండె గజగజ వణుకుతూంది. దానికి నోరు ఉంటే ఎన్ని మాట లనేదో, ఎంతగా అరిచేదో, తన భర్తను ఈ సమరం లోకి దిగ వద్దని ఎంతలా అర్థించేదో!

లేచిన కొరడాలు గాలిలో ఒక్కసారి తిరిగాయి.

కామందు చేతిలో ఎర్రని ఇరవై రూపాయల నోటు కోసం ఆ కొరడాలు పోటీకి తలపడ్డాయి.

ఒక్కొక్కరి వీపు మీద, జబ్బల మీద, ముఖం మీద అవి భరతనాట్యం చేస్తున్నాయి. వింత వింత శబ్దాలు వినవస్తున్నాయి. పులి గాండ్రింపులా, పిడుగుల శబ్దంలా.

సర్. . . సర్. . . సర్. . . షట్. . . షట్. . . సర్ రేర్ర్ర్. . .

సన్నగా ఉన్నా, వాడి చేయి మంచి జోరుగా, నైపుణ్యంతో తిరుగుతూంది. వాడి కొరడా ధాటికి అవతలి వాడు ఆగలేక పోతున్నాడు.

కంజరి. మ్రోగిస్తూంది మూగది, ఆవేశంగా.

ఆ శబ్దానికి వాడు చెలరేగిపోతున్నాడు.

కాలం ఆశ్చర్యంగా తిలకిస్తూ సాగిపోతూంది.

కంజరి శబ్దం నెమ్మదై పోయింది. అపసవ్యంగా మ్రోగుతూంది. వాడు బాగా అలిసి పోయాడు. ఒళ్ళు తేలిపోతూంది. చేయి తిరగలేక మండిపోతూంది.

రౌడీలా ఉన్న వాడికి అవకాశం వచ్చింది. వాడి కొరడా బక్కవాడి కాళ్ళను పెన వేసుకుంది. కొరడాను ఒక్కసారిగా లాగాడు.

అంతే! అంతవరకూ చెలరేగిపోయిన బక్కవాడు సర్రున జారిపోయాడు. చెలరేగిపోవడం ఇప్పుడు రెండవ వాడి వంతయింది.

సర్ ... సర్ ... సర్ ... షట్ ... షట్ ... సర్... సర్ర్ర్ర్ర్.

మూగదాని కళ్ళు చూస్తున్నాయి భయంగా. వేడి కన్నీటి చుక్కలు జలజలా రాలి కింద పడు తున్నాయి.

గట్టిగా అరవాలనుకుంది. వాళ్ళిద్దరి మధ్యా పడి ఆపాలనుకుంది. కానీ, ఎదురుగా పెద్దలు, పెద్ద మనుషులు, వాళ్ళతోటి ఒప్పందం.

పరశురామయ్య అరుస్తున్నాడు — హుషారుగా, ఆనందంగా.

పానకాలు పందెం వోడిపోతానేమో నని దిగాలు పడిపోతున్నాడు.

తమ పెద్ద అరవడంతో జనం కూడా కేరింతలు కొట్టడం మొదలు పెట్టారు.

కేకలు ... అరుపులు ... ఈలలు ...

రౌడీలా ఉన్నవాడి మీద పందెం కాసిన జనం ఎగిరి గెంతుతున్నారు. వాడు గెలిస్తే వాళ్ళకు లాభం. పూరకనే లాభం. ఇంత కష్టపడకుండా లాభం పొంద వచ్చు.

ఆ అరుపులలో, కేరింతలతో వాడు చెలరేగి పోయాడు.

కొరడా జోరుగా విజృంభిస్తూంది.

పరశురామయ్య చేతిలో ఇరవై రూపాయల నోటు రెపరెపలాడుతూంది.

బక్కవాడి ఒంటినిండా రక్తం. మూగదాని గుండెలో వణుకు. కండలుదేరి ఉన్నవాడి గుండెలో గర్వం, ఆశ, ఎర్రని ఇరవై రూపాయల నోటుకోసం ఆత్రుత.

చెలరేగిపోతున్న కొరడా ఒక్కసారిగా ఆగి పోయింది.

బక్కవాడు కదలకుండా పడిపోయాడు.

మూగది పరుగున వెళ్ళి వాడి మీద పడిపోయింది.

లేని గొంతులో బాధ నిండిపోయింది.

వినిపించని భాషలో వేదన పొంగిపోయింది.

బక్కవాడు వోడిపోయాడని నిర్ధారించబడింది.

పందాలు గెలిచిన వాళ్ళు కేరింతలు కొట్టారు. వోడిపోయిన వాళ్ళ ముఖాలు వాలిపోయాయి. పడి పోయిన బక్కవాణ్ణి తిట్టుకున్నారు.

"ఇక అయిపోయిందిగా? ఎల్లండ్రా!"

జనం నెమ్మదిగా కదిలిపోయారు.

చేతిలో కొరడాతో, బిగువైన కండలతో, కళ్ళలో గర్వంతో పరశురామయ్య ముందుకు వచ్చాడు గెలిచిన వాడు.

"భేష్! భలేగా కొరడాని తిప్పావ్రా, అబ్బాయ్! ఇదిగో, నీ ఇరవై రూపాయలు" అని పరశురామయ్య మెచ్చుకోలుతో ఇరవై రూపాయలు నోటు అందిం చాడు వాడికి.

"ఇక నువ్వెళ్ళు" అన్నాడు పానకాలు, కోపంగా.

వాడు ముందుకు కదిలాడు.

"ఇలా ఇయ్యవోయ్ పంద రూపాయలు" అన్నాడు పరశురామయ్య.

"ఇవ్వక తప్పుతుందా చేసుకున్న దానికి!" అన్నాడు పానకాలు.

గర్వంగా ఒక నవ్వు, వికారమైన వికటాట్టహాసం.

తల వంచుకుని వెళ్ళిపోతున్న వాడికి వాళ్ళ మాటలు వినిపిస్తున్నాయి.

"ఒరేయ్!" పరశురామయ్య అరుపులాంటి పిలుపు.

ఒక్కసారి ఆగాడు వాడు. తల వెనక్కు తిప్పి చూశాడు.

దూరంగా పరశురామయ్య పక్కను పానకాలు.

పరశురామయ్య ముఖంలో అదోక రకమైన నవ్వు, పిల్లి చెంగాటం వాటం.

వాడికి కొంచెం దూరంలో ఆ దృశ్యం. బక్కవాడు, వాడి మీద మూగది. గుండెను కాల్చేసే దాని విషాదమైన ఏడుపు. ఎంతటి రాతి గుండె అయినా కరిగిపోయే దాని మూగ ఆవేదన.

కరడుగట్టిన గుండె ఒక్కసారి కదిలింది.

"ఒరేయ్! నిన్నే! దాన్ని, వాణ్ణి తీసుకుపో. నీలాం టోళ్ళే కదా?" పరశురామయ్య గొంతు.

ఆ మాట వాడి రాతి గుండెలోకి దూసుకు పోయింది.

"ఏటి—అత నే టన్నాడు?!

"మాట... ఎంత లోతుగా ఉం దా మాట! ఆ మాటలో ఎంత అర్థం ఉంది! నా వాళ్ళు, నా లాటి వాళ్ళు. అవును. నాలాంటోళ్ళు."

ఆ కరడు దేరిన గుండెలో ఏదో భావం స్ఫురించింది.

ఒక్కసారిగా వెనక్కు తిరిగాడు.

పరశురామయ్య, పానకాలు దగ్గరికి వెళ్ళాడు.

ఒక్కసారి వాళ్ళిద్దరి కళ్ళలోకి సూటిగా చూసి, నడుము దగ్గర పంచెలో దాచిన ఇరవై రూపాయల నోటును పైకి తీశాడు.

దానివైపు, వాళ్ళవైపు ఎర్రగా చూసి, దాన్ని వాళ్ళ కాళ్ళ దగ్గరికి విసిరేశాడు.

ఈ హఠాత్పరిణామానికి ఆశ్చర్యపోయారు పరశురామయ్య, పానకాలు.

వాడు వెనక్కు తిరిగి, మూగదాని దగ్గరికి వెళ్ళి, "నెగు, చెల్లెమ్మా!" అని భుజాలు పట్టుకొని ఆప్యా యంగా లేపి, క్రింద పడిపోయిన బక్కవాణ్ణి రెండు చేతులతో లేపి, భుజం మీద వేసుకొని చకచకా ముందుకు నడిచి వెళ్ళిపోయాడు.

మూగది ఆనందంగా, ఆత్రతగా, ఆశ్చర్యంగా, బాధగా, బరువుగా వాణ్ణి అనుసరించింది. *